ఈనాడు
చిత్తూరు
గురువారం అక్టోబరు 3, 2024



విరుల సోయగం..
విఫణిలో 'ధర'హాసం..!

విజయదశమి, దీపావళి పర్వదినాల ఉత్సవాలు, పూజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని చిత్తూరు జిల్లాలోని రైతులు విస్తారంగా సాగు చేసిన పూలకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. గత నెలలో పక్షాల వల్ల శుభకార్యాలు లేక పోవడంతో ధరలు తగ్గుముఖం పట్టాయి. పర్వదినాలను పురస్కరించుకుని ప్రస్తుతం పూల ధరలు క్రమేణా పుంజుకొంటున్నాయి. ఉత్సవాలు.. పూజలకు అధికంగా వినియోగించే చామంతి పూలకు చక్కటి డిమాండుతో పాటు ధరలు ఖాయమని అన్నదాతలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. కుప్పం మార్కెట్‌లో బుధవారం కిలో చామంతి రూ.85 పలికింది.

- న్యూస్‌టుడే, శాంతిపురం

12 గంటలు సర్వదర్శనానికి

తిరుమల, న్యూస్‌టుడే: ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా బుధవారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులకు దాదాపు 12 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 టికెట్లు కలిగిన వారికి మూడు గంటల సమయం పడుతోంది. మంగళవారం శ్రీవారిని 69,300 మంది దర్శించుకున్నారు. రూ.4.23 కోట్లు హుండీ కానుకలు లభించాయి. గదుల కోసం రద్దీ కొనసాగుతోంది.

నేటి నుంచి టెట్

☛ జిల్లాలో నాలుగు, చెన్నైలో రెండు కేంద్రాలు
☛ 7,198 మంది అభ్యర్థులకు పరీక్షలు



చెన్నైలో టెట్ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న పరిశీలకుడు ప్రసన్నకుమార్

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ కొలువు కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు గురువారం నుంచి ఈ నెల 21 వరకు టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) నిర్వహించేందుకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లా నుంచి 7,198 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరి కోసం జిల్లాలో నాలుగు, చెన్నైలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ విధానంలో పరీక్ష జరగనుంది. రోజుకు రెండు సెషన్లు.. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నారు. టెట్ పరిశీలకుడు ప్రసన్నకుమార్ జిల్లాలోని పరీక్ష కేంద్రాలను మంగళవారం, చెన్నై పరీక్ష కేంద్రాలను బుధవారం పరిశీలించారు.

జిల్లాలో పరీక్ష కేంద్రాలు

చిత్తూరు: ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల (ఎస్వీసెట్, చిత్తూరు- తిరుపతి జాతీయ రహదారిపై, ఆర్వీఎస్ నగర్)
చిత్తూరు: సీతమ్స్ కళాశాల (మురకంబట్టు- ఇరువారం విశ్వేశ్వరయ్య బైపాస్ పక్కన)
పి.కొత్తకోట: వేము ఇంజినీరింగ్ కళాశాల (చిత్తూరు-తిరుపతి జాతీయ రహదారిపై)
పలమనేరు: మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కళాశాల (పలమనేరు- మదనపల్లె రోడ్డు; మల్లేరు, గంగవరం మండలం)
చెన్నై: ప్రగ్య టెక్నాలజీ, ఐయాన్ డిజిటల్ జోన్, కుంద్రత్తూర్

పకడ్బందీగా ఏర్పాట్లు

అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా.. టెట్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు రాష్ట్ర పరిశీలకుడు ప్రసన్నకుమార్ బుధవారం తెలిపారు. ఆన్‌లైన్‌లో జరిగే పరీక్షకు కంప్యూటర్లు, ఎయిర్ కండిషన్ అందుబాటులో ఉంచడంతో పాటు సరైన గాలి, వెలుతురు ఉండాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

బ్రహ్మాండ వేడుక.. భక్తజనులూ రండిక

శ్రీవారి సన్నిధి బ్రహ్మోత్సవ వేడుకలకు సిద్ధమైంది. నవహ్నిక వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ఈనెల 12 వరకు జరగనున్న నేపథ్యంలో లక్షలాదిగా తరలివచ్చే భక్తుల కోసం తితిదే అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. వాహన సేవలు వీక్షించేందుకు వీలుగా మాడవీధుల్లో గ్యాలరీలు క్యూలైన్లు సిద్ధం చేశారు.

- న్యూస్‌టుడే,తిరుమల



విస్తృత ఏర్పాట్లు చేపట్టిన తితిదే

డిస్పెన్సరీలు.. అత్యవసర వైద్యసేవల కోసం తితిదే వైద్యవిభాగం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా 8 ప్రథమ చికిత్సా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే తిరుమల, తిరుపతిలో శాశ్వతంగా ఆరు డిస్పెన్సరీలు ఉన్నాయి. మందులు, అత్యాధునిక వైద్య పరికరాలతో అంబులెన్సులను సిద్ధం చేశారు.



ప్రథమ చికిత్సల టెంట్

నిరంతరాయంగా అన్న ప్రసాదాలు

ప్రతి గ్యాలరీ వద్ద ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నప్రసాదాలు, సాయంత్రం టీ, పాలను శ్రీవారి సేవకులు అందిస్తారు. ఎప్పటికప్పుడు కార్మికులు వ్యర్థాలు తొలగిస్తారు. తితిదే అన్నదానం డిప్యూటీ ఈవో రాజేంద్ర, క్యాటరింగ్ ప్రత్యేకాధికారి శాస్త్రి నిత్యం పర్యవేక్షిస్తారు. మాతృశ్రీ తరిగొండ అన్నప్రసాద కేంద్రం, తిరుమల వ్యాప్తంగా పలు కేంద్రాల వద్ద అన్నప్రసాదాలు నిరంతరాయంగా అందిస్తారు.



గ్యాలరీల్లో తితిదే జలప్రసాదం

గ్యాలరీల్లో జలప్రసాదం

గ్యాలరీలకు చేరుకునే లక్షలాది మంది భక్తుల కోసం అన్నప్రసాదాలు, తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. కీలకమైన గరుడోత్సవం రోజున భక్తులకు అదనంగా కేటాయించనున్నారు. గ్యాలరీల్లో తితిదే జలప్రసాదం అందుబాటులోకి తెచ్చారు. మాడవీధుల్లోని ఆరు ప్రదేశాల్లో 98 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. శిలాతోరణం, కృష్ణతేజ వద్ద తాత్కాలిక మరుగుదొడ్లు ఉన్నాయని తితిదే ఆరోగ్యాధికారి మధుసూదన్ తెలిపారు.



అంకురార్పణకు సర్వం సిద్ధం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి 7 నుంచి 8 గంటల వరకు శాస్త్రోక్తంగా అంకురార్పణ జరగనుంది. గురువారం భగవన్నారాయణుని సేనాధిపతి విష్వక్సేనుడు ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగింపుగా వెళ్లి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు. శుక్రవారం సాయంత్రం 5.45 నుంచి 6.00 గంటల మధ్య మీనలగ్నంలో శాస్త్రోక్తంగా ధ్వజారోహణ జరుగుతుంది.

దర్భచాప, తాడు ఊరేగింపు

బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణానికి ఉపయోగించే దర్భచాప, తాడును తితిదే అటవీ విభాగం కార్యాలయం నుంచి డీఎఫ్‌వో శ్రీనివాసులు ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయానికి బుధవారం తీసుకువచ్చారు. రంగనాయకుల మండపంలో శేషవాహనంపై దర్భతో తయారు చేసిన చాప, తాడును ఉంచారు. ఈ దర్భను కైంకర్యాలు, సేవలు, హోమాల్లో వినియోగిస్తారు. వీటిని ఏర్పేడు మండలం చెల్లూరులో సేకరించారు.



దర్భచాప, తాడుతో డీఎఫ్‌వో శ్రీనివాసులు, తితిదే పారుపత్తేదారు బాల, అటవీశాఖ ఉద్యోగులు

కంకణ భట్టాచార్యులుగా గోవిందాచార్యులు

బ్రహ్మోత్సవాల్లో క్రతువులు, వైదిక కార్యక్రమాల నిర్వహణకు కంకణ భట్టాచార్యులుగా గోవిందాచార్యులు వ్యవహరించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో హోమాలు, వాహనసేవల్లో పూజా కార్యక్రమాలు, వివిధ ఉత్సవాలను ఆయన ఆధ్వర్యంలో అర్చకులు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలు పూర్తయ్యేంతవరకు ఆయన పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారు.



శ్రీవారి ఆలయ మాడవీధుల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక మరుగుదొడ్లు

స్వచ్ఛ చిత్తూరుకు సహకరిద్దాం: కలెక్టర్

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: స్వచ్ఛ చిత్తూరు నగరంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పిలుపునిచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా స్థానిక గాంధీ విగ్రహ కూడలిలోని మహాత్మాగాంధీ విగ్రహానికి బుధవారం ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, నగర మేయర్ అముద, సంయుక్త కలెక్టర్ విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, ఆర్డీవో శ్రీనివాసులు, నగరపాలక కమిషనర్ నరసింహ ప్రసాద్ పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే జగన్మోహన్, మేయర్ అముద



నేడు వారాహి బహిరంగ సభ

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గురువారం తిరుపతిలో వారాహి సభలో వారాహి డిక్లరేషన్ ప్రకటించి శంఖం పూరించనున్నారు. ప్రాయశ్చిత్త దీక్షలో భాగంగా బుధవారం శ్రీవారిని దర్శించుకున్నారు. గురువారం సాయంత్రం నాలుగు గంటలకు తిరుపతి బాలాజీ కాలనీలోని జ్యోతిరావు పులే కూడలిలో జరగనున్న వారాహి సభలో ప్రసంగించనున్నారు. వారాహి వాహనం ఇప్పటికే తిరుపతి చేరుకుంది.



శ్రీవారి దర్శనానంతరం కుమార్తెలతో కలిసి వస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

ఆడుతూ అదృశ్యమై.. అందనంత దూరమై

◆ విషాదాంతమైన పుంగనూరు బాలిక అస్పియా అంజుమ్ కేసు
◆ మిస్టరీ ఛేదనకు పోలీసుల దర్యాప్తు



మృతదేహాన్ని చూసేందుకు తరలి వచ్చిన ప్రజలు



అస్పియా అంజుమ్ (పాత చిత్రం)

చిన్నారి చిరునవ్వులు
వికసించవా అని ఆశ
పొన్నారి చిలుకపలుకులు
వినిపించవా అని శ్వాస
చిట్టి పాదాలు
సందడి చేయవా అని ధ్యాస
వెలుగైన కను'పాప'
కనిపించదా అని తపన
అడుగడుగునా అన్వేషణ
అగుపిస్తావని ఊరంతా నిరీక్షణ
ఆడుతూ అదృశ్యమై..
అంతలోనే అందనంత దూరమై
ఆరిపోయింది చిన్నారి దీపం
ఎదురుచూసిన కళ్లు.. వాకిళ్లు
ఉబికాయి కన్నీటి సెలయేళ్లు
అయ్యో చిట్టితల్లి..
ఎంత ఏడ్చిందో కన్నతల్లి
నీ జలసమాధి
గుండె పాగిలె మాది

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: బాలిక అస్పియా అంజుమ్(7) కథ దుఃఖాంతమైంది. పుంగనూరులో ఆదివారం అదృశ్యమైన బాలిక పట్టణ సమీపంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో బుధవారం శవమై తేలింది. చిన్నారి మరణవార్త తెలుసుకున్న పట్టణ ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

అదే రోజు ఫిర్యాదు


ఆదివారం రాత్రి బాలిక అదృశ్యం కాగా స్థానిక యువత, బంధువులు వెతికారు. ఆచూకీ కనిపించక పోవడంతో తల్లిదండ్రులు అజ్మతుల్లా, షమియా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం డాగ్ స్క్వాడ్ బృందాలు ఉబేదుల్లా కాంపౌండ్, చెంగ్లాపురం రోడ్డు పరిసర ప్రాంతాల్లో సంచరించాయి. ఎస్పీ మణికంఠ రెండు రోజులు అక్కడే ఉండి దర్యాప్తు పర్యవేక్షించారు. డీఐజీ షేముషి భాజ్‌పాయి మంగళవారం పుంగనూరు చేరుకుని బాధితులతో మాట్లాడారు.

సీసీ కెమెరాలు పరిశీలించినా.. ఫ్చ్

పట్టణంలోని ఉబేదుల్లా కాంపౌండ్‌లో బాలిక అదృశ్యమైంది. అక్కడ నుంచి పట్టణంలోని బస్టాండ్ లేదా ఎంబీటీ రోడ్డు, ఎన్టీఆర్ కూడలి, అంబేడ్కర్ కూడలి బైపాస్‌రోడ్డు, ఎన్ఎస్ పేట దారిలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వరకు బాలికను తీసుకెళ్లారు. ఆ పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించినా ఆధారాలు దొరకలేదని సమాచారం.

చివరకు ఎస్ఎస్ ట్యాంకులో తేలిన మృతదేహం

పోలీసులను ముప్పుతిప్పలు పెట్టిన చిన్నారి కిడ్నాప్ చివరకు హత్యగా తేలింది. డీఎస్పీలు సాయికుమార్, ప్రభాకర్, సీఐలు, ఎస్సైలు బుధవారం వేకువజామున పట్టణ శివారులోని నక్కబండ, గూడూరుపల్లె సమీపం, చెంగ్లాపురంలో అనుమానిత ఇళ్లలో జల్లెడ పట్టారు. అయినా ఎటువంటి ఆధారాలు లభించలేదు. బుధవారం ఎస్ఎస్‌ట్యాంకులో మృతదేహం తేలడంతో పోలీసులు గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసినట్లుగా అనుమానిస్తున్నారు. చిన్నారి మృతదేహాన్ని జేసీ విద్యాధరి, ఎస్పీ మణికంఠ పరిశీలించారు. ఎన్ఎస్ పేటలో ఈద్గా వద్ద అస్పియా అంజుమ్ ఆత్మశాంతికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

పరీక్షల నిమిత్తం తిరుపతికి

బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం చేసి కొన్ని అవయవాలను పరీక్షల నిమిత్తం తిరుపతి పరిశోధనశాలకు పంపారు. రిపోర్టు ఆధారంగా తదుపరి చర్యలు చేపడతామని ఎస్పీ తెలిపారు.



విలపిస్తున్న చిన్నారి తండ్రి అజ్మతుల్లా

పేదల అత్యాశపై లాటరీ వల

అంతర్జాలం ముసుగులో వ్యాపారం | వాట్సప్‌లో విక్రయం.. ఆన్‌లైన్‌లో చెల్లింపులు | జిల్లా అంతటా విస్తరిస్తున్న మాఫియా



రండి బాబు రండి.. లాటరీ టికెట్లు కొని అదృష్టాన్ని పరీక్షించుకోండి అనే కాలం పోయింది. అంతర్జాలం ఉన్న చరవాణి చేతబట్టుకుని.. టీ దుకాణాలు, కేఫ్‌లలో దర్జాగా లాటరీ టికెట్లు విక్రయిస్తున్నారు. అనుమానం రాకుండా వాట్సప్‌లోనే టికెట్ల అంకెలు పంపుతున్నారు. ఆన్‌లైన్‌లో చెల్లింపులు జరుగుతున్నాయి. పోలీసులున్నారని.. కేసులు నమోదు చేస్తారనే భయం లేకుండా వ్యాపారం సాగుతోంది. పేదల అత్యాశను ఆసరా చేసుకొని నిలువునా దోచుకుంటున్నారు.

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: తమిళనాడు.. కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దు నగరం చిత్తూరులో లాటరీ టికెట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. గత ప్రభుత్వంలో ఇబ్బడి ముబ్బడిగా సాగిన ఈ వ్యవహారం వేగం తగ్గినా.. దందా మాత్రం అదే స్థాయిలో సాగుతోంది. టికెట్ల రూపంలో జరుగుతున్న వ్యాపారం రూటు మార్చుకుని వాట్సప్‌కి చేరింది. గొలుసుకట్టు తరహాలో యథేచ్ఛగా జరుగుతోంది.

సామాజిక మాధ్యమాలే వేదిక

లాటరీ టికెట్లన్నీ ప్రస్తుతం వాట్సప్‌లోనే విక్రయిస్తున్నారు. గతంలో అధికారిక లాటరీ టికెట్లు దొంగచాటున చిత్తూరు వస్తుంటే.. దాడులు జరుగుతుండటంతో ఆగిపోయాయి. ఆపై కేరళ, మహారాష్ట్ర, పశ్చిమబంగ, మణిపూర్ ఇతర ప్రాంతాల నుంచి అంకెలు మాత్రమే వస్తుంటే.. వాటిని రంగు కాగితాల్లో స్థానికంగానే ముద్రిస్తూ వచ్చారు. వాటి ముసుగులో దొంగ టికెట్లు సైతం ముద్రించి ప్రజలను మోసం చేస్తూ వచ్చారు. ఆపై కాగితాల్లో అంకెలు రాసిస్తూ వ్యాపారం చేస్తున్నా.. ప్రస్తుతం పోలీసుల నిఘా ఉండటంతో వాట్సప్‌లలో అంకెలు పంపుతూ వ్యాపారం చేస్తున్నారు. అక్రమార్కులకు పోలీసు శాఖలో కొంత మంది సహకారం ఉండటంతో వ్యాపారాన్ని సాగిస్తున్నట్లు విమర్శలున్నాయి.

పేదలు, మధ్యతరగతి వర్గాలే లక్ష్యం

మత్తు పదార్థాలకే కాకుండా లాటరీ టికెట్లకు కొందరు బానిసలుగా మారుతున్నారు. ఒక్కో సంస్థకు చెందిన టికెట్లు రోజులో రెండు, మూడు పర్యాయాలు ఫలితాలు విడుదల చేస్తుండటం, టికెట్లు విక్రయిస్తుండటంతో ప్రజలు విధిగా కొనుగోలు చేస్తున్నారు. రోజువారి కూలీలు, వ్యాపారులు, విద్యార్థులు, యువత, మధ్యతరగతి ప్రజలు లక్ష్యంగా కనీసం రూ.100- రూ.5000 వేలు వెచ్చిస్తూ నష్టపోతున్నారు. కొంత మంది సంపాదనలో సగం టికెట్లకే వెచ్చించి నిలువునా మునుగుతున్నారు.

వాడవాడలా ఏజెంట్లు

చిత్తూరు నగరంలో లాటరీ టికెట్ల విక్రయాల కోసం వాడవాడలా ఏజెంట్లు ఉన్నారు. గతంలో సుమారు 24 ప్రాంతాల్లో విక్రయాలు సాగగా.. ప్రభుత్వం మారడం, నాయకులతో పొత్తు కుదరకపోవడం, పోలీసుల నుంచి సహకారం అంతంత మాత్రంగానే ఉండటంతో కొన్ని ప్రాంతాల్లో విక్రయాలు ఆగినా, మిగిలిన ప్రాంతాల్లో సాగుతోంది. గొలుసుకట్టు తరహాలో ఒకరు.. మరో ఇద్దరు.. ఆ ఇద్దరు.. మరో నలుగురు ఇలా ఈ తంతు యథేచ్ఛగా సాగుతోంది. గతంలోలా దుకాణాల్లో కూర్చుని వ్యాపారం చేయకపోయినా.. అంతర్జాలం సాయంగా వివిధ ప్రాంతాల నుంచే తమ దందా నిర్వహిస్తున్నారు.

ఎంతటివారైనా సహించం..



లాటరీ టికెట్ల క్రయవిక్రయాలు అనుమతించం. వాటిని నడిపించే వారు ఎంతటివారైనా సహించం. ఎవరైనా సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. వ్యాపారం చేస్తున్నట్లు తెలిసినా, ఫిర్యాదులు అందినా సంబంధిత వ్యక్తులపై పీడీ చట్టం ప్రయోగిస్తాం.

- సాయినాథ్, చిత్తూరు డీఎస్పీ

ఖరీఫ్ వరకే ఉచిత బీమా

రబీ నుంచి రైతులకు భాగస్వామ్యం

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో సాగు చేస్తున్న వివిధ పంటలకు ఉచిత బీమా వర్తింపజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేరుసెనగ, వరి తదితర పంటలకు వాతావరణ ఆధారిత ఉచిత పంటల బీమా వర్తింపజేశారు. ఈ- పంట ఆధారంగా అమలు చేస్తారు. పంటలు ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావ పరిస్థితులు, తెగుళ్లతో రైతులు నష్టపోతున్నారు. గత అయిదేళ్లలో పెట్టుబడులు పెట్టి పంటలు చేతికొచ్చే సమయంలో అనేక విపత్తులు దెబ్బతీశాయి. కూటమి ప్రభుత్వం ఉచిత బీమా వర్తింపజేయడంతో మేలు జరుగుతుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సౌకర్యం ఖరీఫ్ సీజన్‌కు మాత్రమే పరిమితం చేసింది.

రబీలో ఇలా.. రబీ సీజన్‌కు వచ్చేసరికి పంటలపై బీమా వర్తింపునకు నిర్దేశించిన ప్రీమియం మొత్తాన్ని రైతులు చెల్లించాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ-పంట నమోదుతో పాటు బ్యాంకుల నుంచి రుణం తీసుకునే రైతులు బ్యాంకులోనే అవసరమైన ప్రీమియం చెల్లించాలి. రుణాలు తీసుకోని వారంతా కామన్ సర్వీస్ సెంటర్లలో డీడీ తీసి సంబంధిత బీమా సంస్థ కార్యాలయానికి పంపాలి.



అవగాహన కల్పిస్తాం

ప్రీమియం చెల్లింపుతో పంటల బీమాపై ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. రబీలో ఏయే పంటలకు ఎంత ప్రీమియం చెల్లించాలి తదితర అంశాలు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తాం. పంటల బీమాలో ప్రీమియం ద్వారా కర్షకులను భాగస్వాములు చేస్తాం.

- మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

పూర్తయిన ఈ-పంట నమోదు

జిల్లాలో ఖరీఫ్ సీజన్ ఈ-పంట నమోదు వంద శాతం పూర్తయిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ బుధవారం తెలిపారు. ఖరీఫ్ నందు సాగైన ప్రతి పంట, రైతుల వివరాలు ఈ-పంటలో నమోదు చేశామన్నారు. ఉద్యాన పంటల సాగు వివరాలు నమోదు పూర్తయిందని చెప్పారు. రైతుల ఈకేవైసీ (వేలిముద్ర సేకరణ) 98శాతం పూర్తయిందని.. మిగిలినవి త్వరలో పూర్తి చేయాలని వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖల సహాయకులకు సూచించామని ఆయన తెలిపారు.

గ్రంథాలయాలు..

సెస్సు నిధుల్లేక కుదేలు

పాఠకులకు వసతుల కరవు

పుంగనూరు, కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని కొన్ని స్థానిక సంస్థలు దశాబ్ద కాలానికి పైగా గ్రంథాలయాలకు సెస్సు చెల్లించడం లేదు. సెస్సు ఎందుకు చెల్లించడం లేదని జులై రెండో వారంలో జిల్లాస్థాయి సమీక్షలో అప్పటి జేసీ శ్రీనివాసులు పురపాలక కమిషనర్లు, డీపీవోను ప్రశ్నించారు. అయితే నేటికీ స్పందన లేకపోవడంతో పాఠకులకు వసతులు సమకూర్చడంలో జాప్యం జరుగుతోంది. పురపాలక, పంచాయతీల్లో ప్రజల నుంచి వసూలు చేస్తున్న పన్నుల్లో గ్రంథాలయాలకు 8 శాతం సెస్సును చెల్లించడం లేదు. దీంతో గ్రంథాలయాల్లో వసతులు కరవయ్యాయి.

జిల్లాలో గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 71 గ్రంథాలయాలు పనిచేస్తున్నాయి. వాటిలో 6,12,140 పుస్తకాలు ఉన్నాయి. 6,12,140 మంది సభ్యత్వం తీసుకున్నారు. రోజూ 13,00,874 మంది పాఠకులు గ్రంథాలయాలకు వస్తున్నారు. 50కేంద్రాలకు సొంత భవనాలు, 16గ్రంథాలయాలకు అద్దె మినహాయింపు, 5 అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఈ గ్రంథాలయాలకు ఏటా రూ.5 కోట్ల వసూళ్ల లక్ష్యం.


పుంగనూరులో ఒకే భవనంలో నడుస్తున్న తెలుగు, ఉర్దూ గ్రంథాలయాలు

సౌకర్యాల కల్పన కీలకం..

గ్రంథాలయాల అభివృద్ధి, వాటి పర్యవేక్షణకు, అదనపు సౌకర్యాల కల్పనకు స్థానిక సంస్థల నుంచి వచ్చే సెస్సు కీలకం. ఏళ్ల తరబడి పెద్ద ఎత్తున బకాయిలు ఉండటంతో నేడు అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారింది. ప్రజల నుంచి ముక్కు పిండి మరీ పన్ను వసూలు చేస్తున్న అధికారులు, స్థానిక సంస్థలు గ్రంథాలయాల అభివృద్ధికి సెస్సు జమ చేయకపోవడం దారుణం. సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న నేటి తరంలో డిజిటల్ లైబ్రరీల ఏర్పాటు అత్యవసరం. కానీ ఉన్న గ్రంథాలయాల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.


కుప్పం గ్రంథాలయ భవనం

సెస్సు బకాయిలు (రూ.కోట్లలో) ఇలా...

ప్రాంతం	బకాయిలు
చిత్తూరు	1.05
పలమనేరు	0.15
కుప్పం	0.07
నగరి	0.08
పుంగనూరు	0.05

కృషి చేస్తున్నాం

జిల్లాలోని గ్రంథాలయాలకు రావాల్సిన సెస్సు వసూళ్లకు కృషి చేస్తున్నాం. ఎక్కువ మొత్తంలో బకాయి ఉన్న స్థానిక సంస్థల కార్యాలయాల అధికారులతో సమీక్షించాం. ఉన్న నిధులతో గ్రంథాలయాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నాం.

- శర్మ, కార్యదర్శి, జిల్లా గ్రంథాలయ సంస్థ, చిత్తూరు

పుర తాగునీటి పథకాలకు ఊపిరి

- ఏఐఐబీ పనుల్లో కదలిక
- నాలుగేళ్ల సమయం పొడిగింపు

చిత్తూరు నగరం, సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పురపాలికల్లో ప్రజలందరికీ సురక్షితమైన తాగునీరు అందించాలని 2018లో ఏషియన్ మౌలిక సదుపాయాల పెట్టుబడి బ్యాంకు(ఏఐబీ) నిధుల ద్వారా చేపట్టిన పనుల్లో కదలిక రానుంది. గత వైకాపా ప్రభుత్వం గుత్తేదారులకు బిల్లులు చెల్లించకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఆ పనుల పూర్తికి రంగం సిద్ధమైంది. ఇటీవల ఏఐబీ బృందం క్షేత్రస్థాయిలో నిలిచిపోయిన పనులను పరిశీలించి వెళ్లింది. నిధులిచ్చేందుకు అంగీకారం తెలుపుతూ మరో నాలుగేళ్ల సమయం ఇచ్చారు.


సూళ్లూరుపేట: మంగళంపాడు చెరువులో ఆగిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పనులు

నిధులు జమ చేయని వైకాపా ప్రభుత్వం

కొవిడ్ వల్ల పనుల్లో జాప్యం అనివార్యమైంది. దాంతో 2023 ఫిబ్రవరిలోగా పనులు చేసేందుకు పొడగింపు ఇచ్చారు. తర్వాత సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుంచి పైపులైన్లు వేసి, ట్యాంకుల నిర్మాణం చేపట్టడంతోపాటు, ఇంటింటా కుళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు వీధుల్లోనూ పైపులైన్లు వేశారు. పనులు చురుగ్గా జరుగుతున్న సమయంలో ఏఐబీ వారు గుత్తేదారునికి తమ వాటా నిధులు ఇస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం వాటా ఇవ్వలేదు. దాంతో ఏఐబీ వారు గుత్తేదారులకు చెల్లింపుల కోసం ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా ప్రారంభించి, అందులో రాష్ట్ర ప్రభుత్వం నిధులు జమ చేయాలని కోరగా వారి నుంచి స్పందన కరవైంది. దీంతో ఏఐబీ కూడా నిధులు ఇవ్వకపోవడంతో గుత్తేదారులు పనులు నిలిపేశారు.

అప్పుడేం జరిగిందంటే..

నెల్లూరు ప్రజారోగ్యశాఖ సర్కిల్ పరిధిలో చిత్తూరు నగరపాలక సంస్థతోపాటు పుత్తూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, అద్దంకి, గిద్దలూరు, చీమకుర్తి పురపాలక సంఘాల్లో రానున్న 40 ఏళ్ల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని శాశ్వత తాగునీటి ఎద్దడి పరిష్కారానికి డిజైన్లు రూపొందించారు. ఇందుకు ఏఐబీ రూ.559 కోట్ల నిధుల మంజూరుకు 2018లో ముందుకొచ్చారు. అప్పట్లో అధికారంలో ఉన్న తెదేపా ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అర్బన్ వాటర్ సప్లయ్ అండ్ సెప్టేజ్ మేనేజ్‌మెంట్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టు ఫేస్-1 కింద రూ.559 కోట్లు(ఒకే ప్యాకేజీ కింద) పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. అదే ఏడాది సెప్టెంబరులో సాంకేతిక అనుమతులిచ్చారు. తర్వాత నిర్వహించిన టెండర్లలో ఎన్‌సీసీ సంస్థ పనులు దక్కించుకుంది. ఆ సంస్థ 2019 ఫిబ్రవరిలో 24 నెలల్లో పనులు పూర్తి చేసేలా ఒప్పందం చేసుకున్నారు.

గుత్తేదారులతో సమావేశం

రాష్ట్రంలో ఏఐబీ నిధులతో జరుగుతున్న పనులపై గుత్తేదారులతో మంగళవారం విజయవాడలో ప్రభుత్వ ఆర్థికశాఖ సమావేశం నిర్వహించింది. ఇందులో పలు అంశాలు చర్చకు వచ్చాయి. 2018 ధరలకు, ఇప్పటికీ భారీ వ్యత్యాసం ఉండటంతో ఈ అంశం చర్చకు వచ్చింది. ఇందుకు ఆర్థికశాఖకు చెందిన అధికారులు సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

పథకాల విషయానికి వస్తే..

- తాగునీటి పథకాల ఏర్పాటుకు సూళ్లూరుపేటకు రూ.112.19 కోట్లు, నాయుడుపేటకు రూ.125.44 కోట్లు కేటాయించారు. ఇందులో ఏఐబీ వాటా రూ.166.34 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.71.29 కోట్లు. ఇప్పటి వరకు పనులు చేసినందుకుగాను ఏఐబీ వారు రూ.56.83 కోట్లు విడుదల చేశారు. రెండు పురపాలికల్లో 35 శాతం పనులు జరిగాయి.
- పుత్తూరు పురపాలక సంఘానికి తాగునీటి కోసం కండలేరు-పూండి కెనాల్ నుంచి 55 కి.మీల పైపులైన్‌గాను 35 కి.మీలు మాత్రమే చేశారు. రాయపేడు, లక్ష్మీపురం వద్ద సంపులు నిర్మించాలి.
- చిత్తూరులో అమృత్ పథకానికి అనుసంధానంగా ఏఐబీ నిధులు ఇచ్చింది. అడవిపల్లి రిజర్వాయర్ నుంచి 8.5 కి.మీలు పైపులైన్‌తోపాటు 16 కేఎల్ వీఎల్ఎస్ఆర్ నిర్మించాలి.


పదో తరగతి ఉత్తీర్ణులైన ఖైదీలకు ధ్రువపత్రాలు అందజేస్తున్న జిల్లా న్యాయమూర్తి భీమారావు, కలెక్టర్ సుమిత్‌కుమార్

ఖైదీల్లో పరివర్తనే లక్ష్యం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: క్షణికావేశంలో చేసిన తప్పులకు శిక్ష అనుభవిస్తుంటే.. కుటుంబ సభ్యులు క్షోభ ఉంటుందని, అది గుర్తుపెట్టుకుని సత్ప్రవర్తనతో మెలగాలని.. జైలు శిక్ష పరివర్తన కోసమేనని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ భీమారావు పేర్కొన్నారు. జిల్లా కారాగారంలో బుధవారం గాంధీ జయంతి రోజున ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన పాల్గొని మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఖైదీలు ఉచితంగా న్యాయసేవలు పొందొచ్చని తెలిపారు. జైలుశిక్ష అనుభవిస్తున్న వారి కుటుంబ సభ్యులు సంక్షేమ పథకాలు పొందేందుకు జైలు సూపరింటెండెంట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని గుర్తు చేశారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జైలుకు వచ్చిన తరువాత ఖైదీల సంక్షేమం తమ బాధ్యత అని, వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తామన్నారు. సమస్యలేమైనా ఉన్నా.. తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని వివరించారు. తర్వాత పదో తరగతి ఉత్తీర్ణులైన ఖైదీలకు ధ్రువపత్రాలు అందజేశారు. శిక్షణ కలెక్టర్ హిమవంశీ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి కార్యదర్శి పద్మజ, అదనపు సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల, జైలు సూపరింటెండెంట్ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

5 నుంచి అంతరిక్ష వారోత్సవ పోటీలు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఈనెల 4 నుంచి 10వ తేదీ వరకు దేశ వ్యాప్తంగా జరగనున్న అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా తిరుపతిలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలను శ్రీహరికోట సందర్శనకు తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. 5వ తేదీన ఉదయం పద్మావతి మహిళా వర్సిటీలో జూనియర్స్ (6-9), సీనియర్స్ (10 నుంచి ఇంటర్) విభాగం విద్యార్థులకు రాత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం డిగ్రీ, పీజీ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు, సైన్స్ మోడల్ ఎగ్జిబిషన్ పోటీలు ఉంటాయన్నారు. 7వ తేదీన ఉదయం, మధ్యాహ్నం కరకంబాడి సమీపంలోని శ్రీవేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో జూనియర్స్, సీనియర్స్ విద్యార్థులకు సైన్సు పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తిరుపతిలో సైన్స్ పోటీలు నిర్వహించే కళాశాలల ఆవరణలో ప్రత్యేక సైన్స్ ప్రదర్శనశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

విద్య, క్రీడలు రెండు కళ్లతో సమానం



విజేత జట్టుతో ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్.సత్యనారాయణ

ఏర్పేడు, న్యూస్‌టుడే: యువతకు విద్య, క్రీడలు రెండు కళ్లతో సమానమని ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్.సత్యనారాయణ తెలిపారు. సమయోగ్ కార్యక్రమంలో భాగంగా ఐదు రోజుల పాటు తిరుపతి ఐఐటీలో పలు కళాశాల విద్యార్థులతో జరిగిన క్రీడా పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ నేపథ్యంలోనే తిరుపతి ఎస్వీసీఈ కళాశాల విద్యార్థులు క్రికెట్‌లో, ఐఐటీ విద్యార్థులు బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్‌లో విజేతలుగా నిలిచారు. అథ్లెటిక్ ఓవరాల్ ఛాంపియన్‌గా ఐఐటీకి చెందిన రూపశ్రీ, పురుషుల విభాగంలో మోహన్‌బాబు యూనివర్సిటీకి చెందిన రాజారెడ్డి విజేతగా నిలిచారు. వీరిని ఐఐటీ డైరెక్టర్ అభినందిస్తూ బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం పుస్తకాలతో పోటీపడే విద్యార్థులు ఇలాంటి క్రీడలతో మానసికోల్లాసం పొందవచ్చన్నారు. వివిధ కళాశాలల విద్యార్థులు ఒక్కచోట చేరడంతో స్నేహభావం పెరగడమే కాకుండా సామర్థ్యాలను పెంపొందించుకోవచ్చని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో విద్యార్థుల వ్యవహారాల డీన్ ఎన్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

చిత్తూరులో పెనుగాలుల వర్షం

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే: అల్పపీడనం ప్రభావంతో బుధవారం రాత్రి చిత్తూరులో పెనుగాలుల వర్షం కురిసింది. చిత్తూరు, పరిసర ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో.. విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలిగింది. బుధవారం తీవ్ర ఎండవేడిమితో అల్లాడిపోయిన ప్రజానీకం వర్షంతో ఊపిరిపీల్చుకున్నారు. ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు చిత్తూరు నగరం, చిత్తూరు రూరల్, పూతలపట్టు, గుడిపాల, గంగాధరనెల్లూరు, బంగారుపాళ్యం మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వర్షంతో చిత్తూరు నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మురుగు కాలువలు పొంగిప్రవహించడంతో వాహనచోదకులు అవస్థలు పడ్డారు.


ఉద్యోగ విరమణ చేసిన అధికారులు, కుటుంబ సభ్యులతో ఎస్పీ మణికంఠ

మీ సేవలు అభినందనీయం: ఎస్పీ

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: పోలీసు శాఖలో చేసిన సేవలు అభినందనీయమని జిల్లా ఎస్పీ మణికంఠ తెలిపారు. చిత్తూరు పోలీసు అతిథి గృహంలో బుధవారం ఉద్యోగ విరమణ పొందిన అధికారులను ఆయన ఘనంగా సన్మానించి మాట్లాడారు. 40 ఏళ్లు అంకితభావంతో పనిచేశారని, మీ పనితనం ఎన్నటికీ గుర్తుండిపోతుందన్నారు. విరమణ తర్వాత కుటుంబ సభ్యులతో గడుపుతూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. అందరూ పోలీసు కుటుంబ సభ్యులేనని, ఎలాంటి సాయం అవసరమైనా తమను సంప్రదించాలన్నారు. డీసీఆర్‌బీ ఏఎస్సై బొట్టా కుమార్, సాయుధ దళం ఏఎస్సై సి.జగన్నాథరెడ్డిను కుటుంబ సభ్యులతో పాటు సన్మానించారు. ఏఆర్ డీఎస్పీ మహబూబ్‌బాషా, పోలీసు సంఘం అధ్యక్షులు ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

5న మహిళా వర్సిటీలో స్పాట్ అడ్మిషన్లు

మహిళా వర్సిటీ(తిరుపతి): శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలో ఎంబీఏ, ఎంసీఏ, ఎంబీఏ మీడియా మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 5న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు అడ్మిషన్స్ సంచాలకులు సువర్ణలతాదేవి తెలిపారు. ఏపీ ఐసెట్-24లో అర్హత సాధించి, ఇప్పటివరకు ప్రవేశాలు పొందని విద్యార్థినులు తమ ఒరిజినల్ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని తెలిపారు.

సత్తా చాటిన బౌలర్లు


భారతి

వెంకటగిరి, న్యూస్‌టుడే: ఆంధ్రా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో అండర్-15 ప్రాబబుల్స్ మహిళా క్రికెట్ పోటీలో బౌలర్లు సత్తా చాటారు. బుధవారం నందమూరి తారక రామారావు క్రీడా మైదానంలో గ్రౌండ్ 'ఎ'లో టీమ్ 'డి' బ్యాటింగ్ చేపట్టి 10 వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేసింది. శివాని 23 పరుగులు సాధించారు. టీమ్ 'సి' జట్టులో బౌలింగ్ చేసిన తేజస్విని, హాసిని, భవ్యశ్రీ, నిధి రెండేసి వికెట్లు తీశారు. బరిలో దిగిన టీమ్ 'సి' జట్టు 4 వికెట్ల నష్టానికి 94 పరుగులు చేసింది. జట్టులో గ్రీష్మ 65 పరుగులు చేశారు. 'సి' జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. గ్రౌండ్ 'బి'లో 'ఎ' జట్టు రెండు వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. భారతి 103 పరుగులు చేశారు. టీమ్ 'బి'లో బౌలింగ్ చేసిన దివాన్ 2 వికెట్లు తీశారు. తరువాత బరిలో దిగిన 'బి' జట్టు బ్యాటింగ్ చేపట్టి రెండు వికెట్ల నష్టానికి 163 పరుగులు సాధించింది. సుజన 77, యశోద 62 పరుగులు సాధించారు. 'ఎ' జట్టులో వర్ష 2 వికెట్లు తీశారు. 'బి' జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

నగర మేయర్.. ట్రాఫిక్ సీఐ వాగ్వాదం

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: గాంధీ జయంతి వేడుకల్లో భాగంగా స్థానిక గాంధీ విగ్రహ కూడలిలో బుధవారం నగర మేయర్ అముద, ట్రాఫిక్ సీఐ నిత్యబాబుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వేడుకలు ముగిసిన తర్వాత బయలుదేరడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సిద్ధమయ్యారు. తొలిగా ఎమ్మెల్యే, వరుసగా మేయర్, కలెక్టర్ వాహనాలు నిలిపారు. మేయర్ వాహనాన్ని తీయాలని డ్రైవర్‌కు సీఐ నిత్యబాబు సూచించారు. అదే సమయానికి అక్కడికి చేరుకున్న మేయర్ అముద.. కల్పించుకుని ఎదుట ఉన్న వాహనం కదిలితేనే కదా వాహనం వెళ్లడానికి ఆస్కారం ఉంటుందని సీఐకు సమాధానం ఇచ్చారు. దీంతో 'కారును మీరు నడపడం లేదు కదా.. నేను డ్రైవర్‌కు చెబుతున్నాను'.. అంటూ సీఐ మేయర్‌ను ఉద్దేశించి అన్నారు. ప్రతిగా మేయర్ 'తన పదవిలో వేరొకరు ఉంటే ఇలా ప్రవర్తించేవారా.. ఎస్సీ మహిళను కాబట్టే ఇలా ప్రవర్తిస్తున్నారా' అంటూ సీఐని ప్రశ్నించగా.. తానూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన సీఐనే అంటూ నిత్యబాబు సమాధానమిచ్చారు. ఓ దశలో మేయర్‌ను సీఐ ఏకవచనంతో సంబోధించడంతో ఆమె ఆశ్చర్యానికి గురయ్యారు. తన పర్యటనలో ప్రొటోకాల్ పాటించాల్సిన సీఐ నిత్యబాబు.. ఎక్కడికి వెళ్లినా వాహనాన్ని దూరంగా పెట్టుకోవాలని చెప్పినట్లు మేయర్ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఈ ఘటనపై ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మేయర్ అముద, సీఐ నిత్యబాబును తన కార్యాలయానికి పిలిపించుకుని సర్దిచెప్పినట్లు తెలిసింది.



వాహనంలో ఉన్న మేయర్ అముదతో వాగ్వాదం చేస్తున్న సీఐ నిత్యబాబు

'పురందేశ్వరి భాజపానా.. తెదేపానా..?'

నగరి, న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు తీర్పుపై భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే, బావగారి కళ్లలో ఆనందం కోసం మాట్లాడినట్లు అనిపిస్తోందని వైకాపా అధికార ప్రతినిధి ఆర్.కె.రోజా అన్నారు. ఆమె బుధవారం ఇక్కడ ఓ ప్రకటన విడుదల చేశారు. పురందేశ్వరి మాటలు చూస్తుంటే ఆమె భాజపా అధ్యక్షురాలా.., లేక తెదేపా నాయకురాలా? అనే సందేహం కలుగుతోందని ఎద్దేవా చేశారు. పవిత్ర తిరుమల లడ్డూ ప్రతిష్ఠ దిగజార్చేలా బహిరంగ ప్రకటనలు ఎలా చేస్తారని ముఖ్యమంత్రిని కోర్టు ప్రశ్నించిందని, పదేపదే ప్రెస్‌మీట్లు పెట్టి మాట్లాడిన చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ ఎందుకు కోర్టులో మాట్లాడలేదని ప్రశ్నించారు.

'రోజా వ్యాఖ్యలు తగవు'

తిరుపతి (గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిపై మాజీమంత్రి రోజా చేసిన వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్ రెడ్డి డిమాండ్ చేశారు. శ్రీవారి లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన గత వైకాపా ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యతగా బయటపెట్టడం తప్పా అని ప్రశ్నించారు. న్యాయస్థానంలో న్యాయమూర్తులు అడిగే ప్రశ్నల గురించి ఏ1 జగన్, ఏ2 విజయసాయిరెడ్డిని అడిగి తెలుసుకోవాలని రోజాకు హితవు పలికారు. వెంటనే రోజా, విజయసాయి రెడ్డిలు పురందేశ్వరికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఏఈవో ధనపాల్ సస్పెన్షన్



శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న గోశాల ఏఈవో ధనపాల్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈవో చంద్రశేఖర్ ఆజాద్ బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. వైకాపా నేతలతో అంటకాగిన అధికారులపై ఈవో చర్యలకు శ్రీకారం చుట్టారు. ఏఈవోగా పని చేసిన ధనపాల్‌ను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గోశాలకు బదిలీ చేశారు. తాజాగా గోశాలను సందర్శించిన చంద్రశేఖర్ ఆజాద్ అక్కడున్న సమస్యలను స్వయంగా పరిశీలించారు. గోశాల నిర్వహణ పట్ల అలక్ష్యంగా వ్యవహరించడం, నాలుగు గోపురాల వద్ద ఆలయ ఒప్పంద ఉద్యోగి గంగాధరం సతీమణి పేరుతో దుకాణాల నిర్వహణలో ఏఈవో పాత్ర ఉన్నట్లు ఈవో విచారణలో స్పష్టమైంది. ఈ క్రమంలో ఏఈవో ధనపాల్‌ను సస్పెండ్ చేశారు. దీంతో గతంలో వైకాపాకు అంటకాగిన అధికారుల్లో గుబులు మొదలైంది.

భక్తుల కష్టాలు

మరుగున పడేదెలా?

అలిపిరి బాలాజీ లింకు బస్టాండ్‌లో శ్రీవారి భక్తులకు కనీస వసతులు కొరవడ్డాయి. వాహనాలు నిలిపే ఆవరణలోని పాత మరుగుదొడ్లను మరమ్మతుల కారణంగా మూసివేయడంతో దూరప్రాంత భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. నూతన నిర్మాణాలు పూర్తికాకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. బ్రహ్మోత్సవాలు, పెరటాసి మాసం కావడంతో భక్తుల రద్దీ అధికంగా ఉంది. తితిదే అధికారులు పర్యవేక్షించి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు, మొబైల్ మరుగుదొడ్లు అందుబాటులోకి తీసుకురావాలని, దుర్వాసన రాకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చూడాలని విన్నవిస్తున్నారు.

- ఈనాడు, తిరుపతి


పేరుకుపోతున్న వ్యర్థాలు


నిర్మాణంలో ఉన్న నూతన మరుగుదొడ్లు..


భక్తుల అవస్థలు..


మరమ్మతుల కోసం మూసివేత

404 బస్సులు.. 1,930 ట్రిప్పులు


బ్రహ్మోత్సవాలకు 'ఆర్టీసీ' ప్రణాళిక

తిరుపతి(ఆర్టీసీ), న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు అందించాల్సిన సేవలపై ఆర్టీసీ అధికారులు ప్రణాళిక రూపొందించారు. ప్రత్యేక అధికారులు, సిబ్బందిని నియమించి భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా వారిని గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చేలా చర్యలు చేపట్టారు. సాధారణ రోజుల్లో తిరుపతి- తిరుమల మధ్య 340 సప్తగిరి బస్సులు, 64 విద్యుత్తు ఏసీ బస్సులు ప్రతిరోజూ 1,450 ట్రిప్పులతో 75,000 మంది ప్రయాణికులను చేరవేస్తున్నారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాల్లో రోజుకు 404 బస్సులు 1,930 ట్రిప్పులతో 1.70 లక్షల మంది భక్తులను, గరుడసేవ రోజు 2,714 ట్రిప్పులతో 2.50 లక్షల మంది భక్తులకు సేవలందించేలా ప్రణాళిక రూపొందించారు. పెరటాసి మాసం, దసరా సెలవులను దృష్టిలో ఉంచుకొని తమిళనాడులోని పలు ప్రాంతాల నుంచి వచ్చే భక్తులను తిరుపతి బస్టాండ్ వరకు చేరవేసేందుకు టీఎన్‌ఆర్టీసీ నుంచి 150, ఏపీఎస్‌ఆర్టీసీ నుంచి 150 బస్సులు నడిపేలా ఒప్పందం చేసుకున్నారు.


తిరుమల ఆర్టీసీ బస్సు

✷ బ్రహ్మోత్సవాల్లో బస్సుల నిర్వహణలో లోపాలు లేకుండా నిరంతరాయంగా తిరిగేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆయా డిపోల సూపర్‌వైజర్ల స్థాయి నుంచి చీఫ్ మెకానికల్ ఇంజినీరు (సీఎంఈ) స్థాయి వరకు మొత్తం ఐదు దశల్లో ఘాట్ రోడ్డు బస్సులను క్షుణ్ణంగా తనిఖీ చేశాకనే అనుమతించనున్నారు. ఇతర జిల్లాల నుంచి ఉన్నతస్థాయి అధికారులు 32 మంది, డ్రైవర్లు 200, కండక్టర్లు 180, భద్రతా సిబ్బంది 115 మంది సేవలను వినియోగించనున్నారు.

మెరుగైన సేవలే లక్ష్యం



తితిదే, పోలీసు శాఖల సమన్వయంతో బస్సులను నడిపేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. భక్తులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది పనిచేసేలా ఆదేశాలు ఇచ్చాం. విశ్రాంత ఉద్యోగుల సేవలు వినియోగించుకుంటాం.

- తిమ్మాడి చెంగల్ రెడ్డి, జిల్లా ప్రజా రవాణాధికారి

'మస్కట్ వెళ్లిన తల్లి జాడలేదు'

తిరుపతి(భవానీనగర్), న్యూస్‌టుడే: బతుకుదెరువు నిమిత్తం మస్కట్ దేశానికి వెళ్లిన తన తల్లి ఇంద్రాణి ఏజెంట్ చేతిలో మోసపోయి ఆ దేశంలోనే ఇబ్బందులు పడుతోందని రేణిగుంట మండలం తారకరామా నగర్‌కు చెందిన జాన్సన్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఇంద్రాణి చెల్లెలు సుధారాణితో కలిసి మాట్లాడారు. ఏడు నెలల కిందట తమిళనాడుకు చెందిన ఏజెంట్‌ను నమ్మి రెండోసారి మస్కట్‌కు వెళ్లిందని, అక్కడ ఏమి జరిగిందో తెలియదని, ప్రమాదంలో ఉన్నానని వీడియో పంపి ఇప్పటికి రెండు వారాలవుతున్నా అందుబాటులోకి రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి స్పందించి తన తల్లి జాడను గుర్తించి స్వదేశానికి రప్పించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే జిల్లా ఎస్పీ సుబ్బరాయుడుకు ఫిర్యాదు చేశామన్నారు.


మాట్లాడుతున్న ఇంద్రాణి కుటుంబ సభ్యులు

63 దుంగలు, నాటుతుపాకీ స్వాధీనం

తిరుపతి(మంగళం), న్యూస్‌టుడే: ఏపీ టాస్క్‌ఫోర్స్ బలగాలు కేవీబీపురం మండలం పరిధిలోని అడవుల్లో పెద్దఎత్తున ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నాయి. ఇద్దరు దొంగలను అరెస్ట్‌చేసి నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో బుధవారం జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. పచ్చారుమాను సమీపంలో 63 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని అదేమండలానికి చెందిన ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. వన్యప్రాణులను వేటాడేందుకు ఉపయోగించే నాటు తుపాకీని వారి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.


దుంగలు, స్మగ్లర్లతో ఎస్పీ సుబ్బరాయుడు, టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	113
రిటైల్	135
లేయర్	110
బ్రాయిలర్స్	196
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	223
లేయర్ మాంసం	187

చిత్తూరు

వర్షంతో ఉపశమనం

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: ఎండ వేడిమితో అల్లాడిన నగర ప్రజలు వర్షాలనికి కాస్త చల్లబడ్డారు. బుధవారం రాత్రి నగరంలో కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నా.. రాత్రి వర్షం రాకతో జనం సేదదీరారు. నగరంలోకి కొన్ని ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగింది.


వర్షంలో తడుస్తూ వెళ్తున్న నగరవాసులు

బాధ్యతల స్వీకరణ..

కార్వేటినగరం: ఆబ్కారీ నూతన ఎస్‌ఐ మోసెస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సారా తయారీ, విక్రయాలు అరికట్టడానికి చర్యలు తీసుకొంటామని పేర్కొన్నారు.


మోసెస్

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 80085 74568
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 80085 74601

పాలసముద్రం, న్యూస్‌టుడే :
సమస్య: మండలంలోని వెంగళరాజుకుప్పం పంచాయతీ కొత్తూరు గ్రామానికి వెళ్లే తాగునీటి పైపులైను లీకేజీతో నీరు వృథాగా పోతుంది. పైపులో నీరు కలుషిత కావడంతో తాగునీటికి ఇబ్బంది ఏర్పడి అవస్థలు పడుతున్నాం.
- శివన్న, గ్రామస్థుడు
సమాధానం: వెంటనే పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. **- రమేష్‌బాబు, ఈవోపీఆర్డీ**


సమావేశంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

అసాంఘిక కార్యకలాపాలను అణచి వేస్తాం

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే : అసాంఘిక కార్యకలాపాలను అణచి వేసి, చిత్తూరు నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చి దిద్దుతామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలో, ఎమ్మెల్యే కార్యాలయంలో పోలీసు అధికారులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. గడిచిన నాలుగు నెలల్లో చిత్తూరు నియోజకవర్గంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపినట్లు స్పష్టం చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు చేపట్టాలని, ఈ విషయంలో ఎంతటి వారైనా ఉపేక్షించరాదని ఆదేశించినట్లు వెల్లడించారు. కళాశాలలున్న ప్రాంతాల్లో పోలీస్ పెట్రోలింగ్‌తో పాటు, ఇంకా ఎక్కడైనా రహస్యంగా గంజాయి, డ్రగ్స్ సరఫరా ఉంటే నిఘా ఉంచి ఉక్కుపాదం మోపనున్నట్లు హెచ్చరించారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తున్నామని, త్వరలో పనులు ప్రారంభించి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. టోల్ సంఖ్య ప్రారంభిస్తామన్నారు. తెదేపా పరిశీలకులు పల్లెంటి సునీల్‌కుమార్‌చౌదరి, మేయర్ అముద, ఉప మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, వసంత్‌కుమార్, సీఐలు జయరామయ్య, నెట్టికంఠయ్య, శ్రీధర్‌నాయుడు, శ్రీనివాసరావు, నిత్యబాబు పాల్గొన్నారు.

పొదుపు రుణం.. భవిత వరం

◆ స్వయం ఉపాధిపై మహిళల దృష్టి
◆ బ్యాంకు లింకేజీ రుణాలతో వ్యాపారాభివృద్ధి

చిత్తూరు నగరం: గ్రామీణ ప్రాంత మహిళలకే కాదు.. పట్టణ ప్రాంత పేద మహిళలకూ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో నగరంలోని స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా స్వయం ఉపాధికి బాటలు వేసుకుంటున్నారు. వివిధ రకాల వ్యాపారాలు చేపడుతూ ఆదాయం పొందుతూ కుటుంబానికి అండగా ఉంటున్నారు. భర్త సంపాదనకు చేదోడువాదోడు, కుటుంబ నిర్వహణలో తమ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. స్వయం ఉపాధిలో రాణిస్తూ ఆత్మవిశ్వాసంతో అడుగులు ముందుకు వేస్తున్నారు. చిత్తూరు నగరంలో వ్యాపార నిర్వహణ ద్వారా ఉపాధి పొందుతున్న మహిళల విజయగాథలివీ..

నిత్యావసరాల దుకాణంతో



స్థానిక సత్యానారాయణపురానికి చెందిన **చంద్రకళ**.. స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా ఉన్నారు. పొదుపు సంఘంలో చాలా ఏళ్లుగా సభ్యురాలిగా ఉన్న ఆమె.. బ్యాంకు లింకేజీ ద్వారా రూ.2లక్షల రుణం పొందారు. స్థానికంగానే నిత్యావసర వస్తువుల దుకాణాన్ని ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందుతున్నారు. పెట్టుబడి పోనూ నెలకు రూ.15వేల వరకు ఆదాయం వస్తోందని చెబుతున్నారు. బ్యాంకు రుణంతో తనకాళ్లపై తాను నిలబడ్డానని తెలిపారు. వ్యాపారాన్ని మరింతగా విస్తరించనున్నట్లు చెబుతున్నారు.

పేపర్‌ప్లేట్ల తయారీ.. ఆదాయానికి దారి



స్థానిక వినాయకపురానికి చెందిన సోమేశ్వరి మహిళా సమాఖ్య పరిధిలోని పొదుపు సంఘం సభ్యురాలు. స్థానికంగా ఓ పేపర్‌ప్లేట్ల తయారీ యూనిట్‌ను నిర్వహిస్తున్నారు. మెప్మా ద్వారా బ్యాంకు లింకేజీ రుణం రూ.2లక్షల పెట్టుబడితో ఏర్పాటు చేశారు. కుటుంబ సభ్యుల తోడ్పాటుతో స్వయం ఉపాధిపై ఆమె దృష్టి సారించారు. స్వయం సహాయక సంఘంలో సభ్యత్వం ద్వారా అవసరమైన సందర్భాల్లో పెట్టుబడి రుణాన్ని బ్యాంకు లింకేజీ ద్వారా మంజూరు చేయించుకుంటోంది. తన వ్యాపారం ద్వారా నెలకు రూ.20వేల వరకు ఆదాయాన్ని కళ్ల జూస్తున్నట్లు సోమేశ్వరి చెబుతోంది.

ఇంటి దగ్గరే ఉంటూ..



స్థానిక ధర్మరాజులకాలనీకి చెందిన సెల్వి.. లక్ష్మి నారాయణ సమాఖ్య పరిధిలోని ఓం శక్తి పొదుపు సంఘం సభ్యురాలిగా కొనసాగుతోంది. స్వయం ఉపాధితో తన కాళ్లపై తాను నిలబడాలన్న ఉద్దేశంతో దుస్తుల వ్యాపారాన్ని చేపట్టింది. బ్యాంకు లింకేజీ ద్వారా రూ.లక్ష రుణం పొంది దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. నిర్వహణ వ్యయం పోగా.. నెలకు రూ.15వేల ఆదాయం వస్తోందని ఆమె తెలిపారు. వ్యాపార నిర్వహణతో కుటుంబానికి ఆసరాగా నిలిచినట్లు ఆమె చెబుతున్నారు. ఇంటి వద్దే ఉంటూ ఈ మాత్రం సంపాదిస్తుండటం ఆనందంగా ఉంటోందన్నారు.


బాధితులకు చెక్కు అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

బాలిక చికిత్సకు మనం ఫౌండేషన్ ఆర్థికసాయం

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తూ గాయపడిన బాలిక చికిత్స నిమిత్తం చిత్తూరులోని మనం ఫౌండేషన్ తరపున యువత తమవంతు సాయాన్ని అందించారు. స్థానిక ప్రశాంత్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ సాయిప్రేమ్ కుమార్తె అలీజాపై వేడి పాలు పడటంతో ఒళ్లంతా కాలిపోయి.. వేలూరు సీఎంసీ ఆసుపత్రిలో చికిత్స పొందింది. దాతల నుంచి సేకరించిన రూ.45 వేలు, చిత్తూరు ఫర్ యూ గ్రూప్ సేకరించిన రూ.32,250 మొత్తం రూ.77,250 బుధవారం బాలిక తల్లిదండ్రులకు అందజేశారు. యుగంధర్, మురళి, ఢిల్లీగణేష్, హరి, రెడ్డిమస్తాన్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంతో సంపూర్ణ ఆరోగ్యం

కాణిపాకం, న్యూస్‌టుడే: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచితే.. సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని డీపీవో లక్ష్మీ తెలిపారు. మండలంలోని కాణిపాకంలో జరిగిన కార్యక్రమంలో బుధవారం పాల్గొని మాట్లాడారు. పారిశుద్ధ్య నిర్వహణలో సిబ్బందిని కీలకపాత్ర ఉందన్నారు. చెత్త సేకరణ కేంద్ర ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. సర్పంచి కేవస్ శాంతిసాగర్‌రెడ్డి, ఈవోపీఆర్డీ కుసుమ కుమారి, కార్యదర్శి సత్యంరెడ్డి పాల్గొన్నారు.


ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న డీపీవో లక్ష్మీ


తెదేపా కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఎమ్మెల్యే గురజాల, నాయకుల నివాళి


చిత్తూరు(సంతపేట): చిత్తూరులోని గాంధీ విగ్రహం వద్ద భాజపా నాయకులు


నగరిలో మున్సిపల్ కార్మికులను సన్మానిస్తున్న మున్సిపల్ ఛైర్మన్, కమిషనర్, అధికారులు

గాంధీజీ మార్గం అనుసరణీయం

న్యూస్‌టుడే, బృందం: జాతిపిత గాంధీజీ నడిచిన అహింసా మార్గంలో యువత నడవాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆయన చెప్పిన సత్యం, ధర్మం, అహింస ప్రజలందరికీ ఆదర్శమన్నారు. దేశ ప్రగతి కోసం గాంధీజీ కన్న కలలు సాకారం చేసేందుకు ప్రతి పౌరుడు ముందుకు రావాలని కోరారు. గాంధీజీ జయంతి వేడుకలు వాడవాడలా పండుగ వాతావరణంలో జరిగాయి. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. శ్రమదానం, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో బుధవారం గాంధీ జయంతి వేడుకలు జరిగాయి.


కాణిపాకం: గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆలయ ఈవో గురుప్రసాద్


పుత్తూరు మున్సిపల్ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, అధికారులు


గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న డీఎంహెచ్‌వో ప్రభావతి దేవి, వైద్యాధికారులు


కలెక్టరేట్: మహాత్మా గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న డీఆర్‌వో పుల్లయ్య


చిత్తూరు గ్రామీణ: సీపీఐ నాయకులు


బంగారుపాళ్యంలో..


నగరి: గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఆర్‌డీఓ వెంకటరెడ్డి

నవరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు

పుత్తూరు, న్యూస్‌టుడే: దసరా నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో పట్టణంలోని ఆలయాలు విద్యుత్తు దీపాలతో సుందరంగా అలంకరించారు. శ్రీకామాక్షి సమేత శ్రీసదాశివేశ్వరాలయం, గ్రామ దేవత ఆరేటమ్మ, శ్రీకన్యకా పరమేశ్వరీ, ద్రౌపదిదేవి సమేత శ్రీధర్మరాజుల ఆలయం, రాచపాళెంలో దుర్గాదేవి ఆలయాలను సుందరంగా అలంకరించారు.


విద్యుత్తు దీపకాంతుల్లో శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయం

నేటి నుంచి అంకాళ పరమేశ్వరి ఆలయంలో..

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: గుర్రప్పనాయుడువీధిలో వెలసిన అంకాళ పరమేశ్వరి ఆలయంలో గురువారం నుంచి దసరా ఉత్సవాలు జరగనున్నాయి. అమ్మవారు 3న శ్రీ లక్ష్మీ, 4న కాశీ విశాలాక్షి, 5న అర్ధనారీశ్వరి, 6న అన్నపూర్ణ, 7న కేరళ ఛోటానిక్కరై భగవతిమాత, 8న మధుర మీనాక్షి, 9న కంచి కామాక్షి, 10న మహిషాసురమర్ధని, 11న సరస్వతి, 12న శ్రీ రాజరాజేశ్వరి అలంకరణలో దర్శనమివ్వనున్నట్లు అర్చకులు కుమార్ తెలిపారు.


పార్టీ కండువా కప్పుతున్న గుత్తా ప్రభాకర్‌నాయుడు

భాజపాలో చేరిక

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: భాజపా మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుత్తా ప్రభాకర్‌నాయుడు సమక్షంలో బుధవారం పలువురు భాజపాలో చేరారు. స్థానిక కొంగారెడ్డిపల్లె వద్ద జరిగిన కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు పుల్లారెడ్డి, శ్రీనివాసరెడ్డి, మునిరత్నం, నవీన్ పార్టీలో చేరారు.

భాజపాను బలోపేతం చేయాలి

వెదురుకుప్పం: సభ్యత్వ నమోదును విరివిగా చేపట్టి భాజపాను బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి భానుప్రకాష్‌రెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ ప్రాంతీయ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర పథకాలను పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి ప్రజలకు తెలియజేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు జగదీశ్‌నాయుడు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజేంద్రన్, మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భాజపా నేత భానుప్రకాష్‌రెడ్డి

కాలానుగుణ వ్యాధులపై అవగాహన తప్పనిసరి

వెదురుకుప్పం: వాతావరణ మార్పులతో ప్రజలకు కాలానుగుణ(సీజనల్) వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని జిల్లా వైద్యశాఖాధికారిణి ప్రభావతి దేవి సూచించారు. బుధవారం పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు దస్త్రాలు పరిశీలించారు. ఔషధాలు పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్టుకు ఎంపిక

విజయపురం, న్యూస్‌టుడే: గంగవరం మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్-17 వాలీబాల్ బాలుర విభాగంలో పన్నూరు జిల్లా ఉన్నత పాఠశాలకు చెందిన సేబాస్టిన్ విజయనగరం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యారు.


సేబాస్టిన్

గుండెపోటుతో తెదేపా నేత మృతి

పెనుమూరు: మండల తెదేపా మాజీ ఉపాధ్యక్షుడు, సింగిల్‌విండో మాజీ సభ్యులు పైపల్లె గ్రామానికి చెందిన జి.రామ్మూర్తి(శివాజీ) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. మాజీ ఎంపీపీ హరిబాబునాయుడు, సింగిల్‌విండో మాజీ పర్సన్ ఇన్‌ఛార్జి ఎండీనాయుడు, తెలుగు యువత మాజీ అధ్యక్షుడు రామచంద్రనాయుడు తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం

ఐరాల, న్యూస్‌టుడే: యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యల పట్ల గత 50 సంవత్సరాలుగా అలుపెరగని పోరాటం చేస్తున్నట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు తెలిపారు. మండలంలోని పొలకల జడ్పీ ఉన్నత పాఠశాలలో స్వర్ణోత్సవాల మహాసభలను బుధవారం ఘనంగా నిర్వహించి మాట్లాడారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.మణిగండన్, సహాధ్యక్షుడు పి.మునిరత్నం, ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు రాధకృష్ణ పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధికి కృషి చేయండి

యాదమరి: గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డ్వామా పీడీ రవికుమార్ అన్నారు. బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని మాధవరం పంచాయతీలో గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా 2025-26 కు సంబంధించి ఉపాధిహామీ పథకంలో రూపొందించనున్న ప్రణాళికను వివరించారు. గ్రామ సభ ఉద్దేశాన్ని తెలియజేశారు. ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

ఎమ్మెల్యేను కలిసిన ఎక్సైజ్ సీఐ.. పుత్తూరు: పుత్తూరు ఎక్సైజ్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన మురళీమోహన్ బుధవారం నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

నేటి నుంచి దసరా ఉత్సవాలు.. బంగారుపాళ్యం: మండలంలోని బోయకొండ గంగమ్మ ఆలయంలో ఈనెల మూడు నుంచి దసరా ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ధర్మకర్త, రాధమ్మకృష్ణప్ప, ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శనాలకు తరలిరావాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు.. కార్వేటినగరం: ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకొంటామని ఇన్‌ఛార్జి ఎంపీడీవో లక్ష్మీపతి అన్నారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. మురుగు కాలువలు, సీసీరోడ్లు, తాగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. సర్పంచి ధనంజయవర్మ, ఈవో మణి పాల్గొన్నారు.

అన్నదానం.. నగరి: నగరి అయ్యప్ప దేవాలయంలో జన్మనక్షత్రం పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. తిరుమలకు కాలి నడకన వెళుతున్న గోవిందమాల భక్తులకు అన్నదానం చేశారు.

తర్పణాలు వదిలేందుకు పోటెత్తిన ప్రజలు.. పెనుమూరు: మహాలయ అమావాస్య సందర్భంగా మండలంలోని ఎన్టీఆర్ జలాశయం వద్ద ఉన్న రుద్ర పాదాల వద్ద జనసందోహం నెలకొంది. పితృదేవతలకు తర్పణం వదిలేందుకు మండలంతో పాటు చిత్తూరు, పూతలపట్టు, జీడీనెల్లూరు మండలాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక పూజలు చేసి నదిలో తర్పణాలు వదిలారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి.. చిత్తూరు(క్రీడలు): హిందూ దేవాలయాలపై ప్రభుత్వ పెత్తనం ఏమిటని, దేవాలయాలల్లో అన్యమతస్థుల్ని వెంటనే తొలగించాలని విశ్వహిందూ పరిషత్తు అధ్యక్షులు పట్నం సురేంద్రరెడ్డి అన్నారు. తిరుపతి లడ్డు పవిత్రత కాపాడాలని కోరుతూ.. విశ్వహిందూ పరిషత్తు ఆధ్వర్యంలో బుధవారం నగరలో ర్యాలీ నిర్వహించారు. వివాదంపై సిట్టింగ్ జడ్జితో ప్రభుత్వం విచారణ చేపట్టి, బాధ్యుల్ని కఠినంగా శిక్షించాలన్నారు. ధార్మిక పరిషత్తు పేర్పాటు చేసి, దేవాలయ వ్యవస్థను నిర్వహించాలన్నారు. వేలు, ఉపాధ్యక్షులు రామూర్తి, కోశాధికారి శివకుమార్ పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై ఉద్యమించాలి.. చిత్తూరు గ్రామీణ: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణపై తెదేపా, జనసేన మౌనంగా ఉండటం దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేకంగా సీపీఐ నాయకులు దర్గా కూడలిలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట బుధవారం నిరసన చేపట్టారు. గోపినాథ్, చంద్ర, విజయ గౌరీ, ఆర్ముగంరెడ్డి, విజయకుమార్ పాల్గొన్నారు.

ఐదుగురిని కరిచిన కుక్కలు.. పెనుమూరు: మండలంలోని గొడుగు మానుపల్లె గ్రామంలో వీధికుక్కలు హల్‌చల్ చేస్తున్నాయి. రెండు రోజుల్లో ఐదుగురిని కరిచాయి. వీధిలో ఆడుకుంటున్న పిల్లలపై దాడులు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కుక్క కాటుకు గురైన పిల్లలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అవసరమైన చర్యలు తీసుకుంటామని ఇన్‌ఛార్జి కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు.

ఆటల్లో మెరికలు

● స్థాయి పోటీల్లో సత్తా
● పతకాల సాధనలో ముందంజ



చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: గ్రామీణ నేపథ్యం కలిగిన పాఠశాలల విద్యార్థులు.. ఆటల్లో మెరికల్లా దూసుకెళ్తున్నారు. వ్యాయామ శిక్షకుల ప్రోత్సాహంతో క్రమశిక్షణతో సాధనతో చేస్తూ.. పట్టు వదలకుండా ప్రయత్నిస్తూ పతకాలు సాధిస్తున్నారు. భవిష్యత్‌లో జాతీయ స్థాయిలోనూ ప్రతిభ చాటాలనే సంకల్పంతో కసరత్తు చేస్తున్నారు.

కత్తిదూసి.. పతకం గెలిచి..



ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. మండలంలోని ఐలవారిపల్లె స్వగ్రామం. తల్లిదండ్రులది వ్యవసాయ నేపథ్యం. రోహిత్‌కు క్రీడలంటే ఇష్టం. సాఫ్ట్‌బాల్, ఫెన్సింగ్‌లో ప్రావీణ్యం సాధించాడు. గతేడాది నంద్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించాడు. ఆర్మీలో ఉద్యోగం సాధించడం తన లక్ష్యమని అంటున్నాడు - **రోహిత్**

పతక 'రూప'ం



రూప.. ఐరాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. మండలంలోని నయనంపల్లె స్వగ్రామం. సోదరి.. సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణిగా రాణిస్తోంది. ఆమె స్ఫూర్తితో సాఫ్ట్‌బాల్ శిక్షణలో చేరి మూడేళ్లుగా సాధన చేస్తోంది. బాలిక ప్రతిభ గుర్తించి వ్యాయామ శిక్షకులు ప్రతిరోజూ తర్ఫీదు నిస్తూ మెలకువలు నేర్పించారు. జిల్లా స్థాయి పోటీల్లో సత్తాచాటి జిల్లా జట్టుకి ఎంపికైంది. భవిష్యత్తులో రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రాణిస్తాననే ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. **-రూప**

సాఫ్ట్‌బాల్‌లో ప్రకాష్



ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. క్రీడలంటే ఎంతో ఆసక్తి. తల్లి కూలి పనులు చేస్తూ చదివిస్తోంది. స్నేహితులతో కలసి ఆడుతున్న సమయంలో ఇతని ప్రతిభ గుర్తించారు వ్యాయామ శిక్షకులు. ప్రతిరోజూ శిక్షణనిచ్చారు. అలా గతేడాది కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తాచాటాడు. ఈ ఏడాది జరగనున్న సబ్ జూనియర్స్ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో తలపడే రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్నాడు. పతకంతో వస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నాడు **-ప్రకాష్**

పరిసరాల పరిశుభ్రతే ధ్యేయం

పుత్తూరు, న్యూస్‌టుడే: పరిసరాలు పరిశుభ్రత .. మనందరి ధ్యేయం కావాలని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. పుత్తూరు మున్సిపల్ కార్యాలయంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చీపురు చేతబట్టి చెత్తను ఊడ్చారు. కళ్యాణపురం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో భాజపా అధ్యక్షుడు శ్రీధర్‌నాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. **వెదురుకుప్పం:** గాంధీ జయంతిని పురస్కరించుకొని మండలంలోని అన్ని సచివాలయ పరిధుల్లో స్వచ్ఛతా హీ పక్షోత్సవాలను అధికారులు, ప్రజా ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. **పూతలపట్టు:** గాంధీ జయంతిని పురస్కరించుకుని మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలను పునః ప్రారంభించినట్లు ఈవోపీఆర్డీ శ్రీనివాసులు తెలిపారు. **బంగారుపాళ్యం:** మండలంలోని గుంతూరులోని గాంధీ జయంతి సందర్భంగా బుధవారం చెత్త సంపద కేంద్రాన్ని శుభ్రం చేసినట్లు తెదేపా మండల వాణిజ్య అధ్యక్షులు వంశీచౌదరి తెలిపారు.


పుత్తూరు: స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా చీపురు పట్టిన భాజపా నాయకులు

పలమనేరు

●పలమనేరు ●కుప్పం ●పుంగనూరు

నేడు గ్రామసభలు

గుడుపల్లె, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి విడుదలైన వివిధ నిధులపై పంచాయతీ కేంద్రాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తాజ్‌మస్రూర్ బుధవారం తెలిపారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు పంచాయతీ ఖాతాలకు జమైన నిధులు, పనులు అందుకు చేసిన వ్యయం మిగులు నిధులపై గ్రామసభలు జరుపుతున్నట్లు తెలిపారు.

ఉపాధి అవకాశాలపై అవగాహన

నదుం, న్యూస్‌టుడే: బట్టువారిపల్లె గ్రామంలో కలకడ షరీఫ్‌సాహెబ్-ఫాతిమాబి మెమోరియల్ ట్రస్ట్, తిరుపతికి చెందిన మరో సంస్థ సహకారంతో బుధవారం యువతీయువకులకు ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

వేడుకగా అమావాస్య పూజలు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: దేవదొడ్డి గ్రామంలోని శ్రీ అంకాల పరమేశ్వరి ఆలయంలో బుధవారం వేడుకగా మహాలయ అమావాస్య పూజలు నిర్వహించారు. అర్చకులు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణతో అర్చనలు, పూజలు జరిపారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

న్యూస్‌టుడే, శాంతిపురం

సమస్య: 64-పెద్దూరు పంచాయతీ సోలిశెట్టిపల్లెలో తాగునీటి చేతిపంపు మరమ్మతుకు గురైంది. బోరును వినియోగంలోకి తీసుకురావాలి. - మంజుళమ్మ

సమాధానం: క్షేత్రస్థాయిలో పరిశీలించి చేతిపంపుకు మరమ్మతులు చేపడతాం. - మనోజ్, ఏఈ, గ్రామీణ నీటి సరఫరా విభాగం

గుడుపల్లె, న్యూస్‌టుడే:

సమస్య: గుడుపల్లె పంచాయతీ కాటిపల్లె ప్రధాన వీధిలో పెద్దపులి గంగమ్మ ఆలయ సమీపంలోని మురుగు కాల్వల్లో మురుగు కదలడం లేదు. శుభ్రత చర్యలు చేపట్టాలి. - వెంకటేశు, స్థానికుడు

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులతో పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. - అజహర్‌బాషా, కార్యదర్శి

పొదుపు సంఘాల బలోపేతానికి ప్రభుత్వ తోడ్పాటు

పలమనేరు, న్యూస్‌టుడే: పొదుపు సంఘాల బలోపేతానికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో చేపట్టిన గాంధీ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మెప్మా మహిళా మార్ట్‌ను సందర్శించారు. మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలన్నారు. బాపూజీ పార్కులోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్కులో పిల్లల ఆటవిడుపు కోసం దాతలు ఏర్పాటు చేసిన ఊయలను ప్రారంభించారు. స్వచ్ఛత అవార్డులు సిబ్బందితో పాటు ఆయన చెత్తను ఊడ్చారు. కార్యక్రమంలో కమిషనర్ ఎన్‌.రమణారెడ్డి, బాలాజీ కో-ఆపరేటివ్ సూపర్‌బజార్ అధ్యక్షుడు ఆర్వీ బాలాజీ, తెదేపా నాయకులు కుట్టి, గిరిబాబు, సుబ్రహ్మణ్యం గౌడ పాల్గొన్నారు.



చెత్త ఊడుస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పచ్చని చెట్లపై వేటు.. వాల్టాకు తూట్లు

ఇష్టానుసారంగా నరికివేత

పట్టించుకోని అధికారులు



అక్రమంగా నరికివేసిన చింత చెట్టు

పుంగనూరు, న్యూస్‌టుడే: నీరు, భూమి, చెట్లను సంరక్షించడానికి తీసుకొచ్చిన వాల్టా చట్టం పుంగనూరు నియోజకవర్గంలో ఉల్లంఘనకు గురవుతోంది. వాల్టా చట్టం 2004 నుంచి అమలులో ఉన్నా ఇక్కడ పాటించడం లేదు. అధికారులు ఆ చట్టం అమలుకు ఇసుమంతైనా దృష్టి సారించడం లేదనే విమర్శలు ఉన్నాయి.

తమిళనాడుకు తరలింపు

ఇక్కడి చింతచెట్లను ఇష్టానుసారం నరికేసి తమిళనాడులోని గుడియాత్తంకు నిత్యం తరలిస్తున్నారు. అక్కడ ఇటుక బట్టీలతో పాటు చర్మ పరిశ్రమలు, వివిధ కంపెనీల బ్రాయిలర్స్ అధికంగా ఉండటంతో అక్రమార్కులు ఈ అక్రమ మార్గాన్ని ఎంచుకున్నారు. అక్రమ వ్యాపారం జోరుగా సాగు

ఇందుకు నిదర్శనం పుంగనూరు, చౌడేపల్లె, సోమల మండలాల్లో రియల్‌ఎస్టేట్ పేరుతో, ఇటుకల తయారీ, వంట చెరకుగా విక్రయించడానికి చెట్లను ఎక్కువదతికి అక్కడ నరికేస్తున్నారు. పలితంగా పర్యావరణం దెబ్బతినడం, భూగర్భజలాలు అడుగంటిపోవడం వంటి నష్టాలు ఉంటాయని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల సహకారం ఉండడంతో అక్రమార్కులు యథేచ్ఛగా తమ కార్యకలాపాలను సాగిస్తున్నారు.

నిబంధనలు ఇవీ

రైతులు తమ పొలాల్లోని చెట్లను నరికివేయాలన్నా వాల్టా చట్టం ప్రకారం సర్వే నంబరుతో సహా దరఖాస్తు చేసుకోవాలి. తహసీల్దారు ఆదేశంతో ఆ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతు పేర్కొన్న కారణాలు నమ్మశక్యంగా ఉంటే అటవీ అధికారులకు నివేదిక పంపాలి. వారి అనుమతి కోసం ఒక్కో వాహనానికి చలానా చెల్లించాలి. రెండు శాఖల అనుమతి పొందిన తర్వాతే చెట్లను నరికివేసే తరలించడానికి అవకాశం ఉంటుంది. అయితే ఈ నిబంధనలేవీ క్షేత్రస్థాయిలో జరగడం లేదు.

తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. తమిళనాడులో చింతకట్టెకు ఎక్కువ డిమాండు ఉండడంతో అక్రమార్కులు స్థానికంగా ఒక్కరిద్దరిని మధ్యవర్తులను పెట్టుకుని వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. మారుమూల గ్రామాల్లోనే కాదు ప్రధాన, జాతీయ రహదారుల పక్కలో రైతుల పొలాల్లోని చెట్లను రాత్రింబవళ్లు తేడా లేకుండా నరుకుతున్నారు.

ప్రజలు సమాచారం ఇవ్వాలి

ప్రతి మండల పరిధిలో రెవెన్యూ, అటవీశాఖ అధికారులు, సిబ్బందికి చెట్ల నరికివేతపై స్థానిక ప్రజలు సమాచారం అందించాలి. ఇప్పటికే టమాటా పంటకు ఉపయోగించే కట్టెలు తరలించే అక్రమార్కుల వాహనాలకు జరిమానా వేశాం. చింతచెట్లు, ఇతర కలప చెట్ల నరికివేతకు పాల్పడుతున్న అక్రమార్కులపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. క్షేత్రస్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటాం.

- శ్రీరాములు, ఎఫ్ఆర్వో, పుంగనూరు

బోరుకు మోటారు ఏర్పాటు

సోమల, న్యూస్‌టుడే: మండలంలోని 81.ఉప్పరపల్లె పంచాయతీ తంగేటిమిట్ట గంగమ్మ ఆలయం వద్ద బోరు మోటారు మరమ్మతుకు గురైంది. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య నెలకొంది. సమస్యను ఈ నెల 17న 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికతో 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన సర్పంచి సిద్ధులమ్మ, ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి, కార్యదర్శి జయశంకర్ కొత్త మోటారు అమర్చేందుకు చొరవ తీసుకున్నారు.

స్పందనకు స్పందన

గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని నెక్కుంది పంచాయతీ కేంద్రంలోని వీధులను పారిశుద్ధ్య కార్మికులు బుధవారం శుభ్రం చేశారు. ఈ నెల 2న 'ఈనాడు'లో 'మేమున్నాం.. మీకు తోడుగా'లో సమస్యపై వార్త ప్రచురితమైంది. స్పందించిన కార్యదర్శి బసవరాజ గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు.

అధికారులూ పట్టించుకోండి..!



స్థానిక ఎంపీడీవో కార్యాలయం పక్కన ప్రమాదకర గుంత ఉన్నా ఎవరికీ పట్టడం లేదు. గుంతలో మురుగు చేరి దుర్వాసన వస్తున్నా ముక్కు మూసుకుని వెళ్తున్నారే తప్ప పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదు. పరిపాలనా భవనంలోనే ఇలా ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి ఏమి అంటూ పలువురు విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించాల్సిన అవసరముంది. ఈ విషయంపై ఎంపీడీవో కృష్ణవేణిని వివరణ కోరగా గుంత పూడ్చి వేయను చేస్తామన్నారు.

- న్యూస్‌టుడే, చౌడేపల్లె

వరద ఇలా.. నడిచేదెలా...!



పంజాణిమండలం గ్రామంలోని ప్రధానవీధి వర్షపునీటితో నిండిపోయి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా.. ఇక్కడి స్థానికులకు అవస్థలు తప్పడం లేదు. బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి వర్షపునీరు వీధిలో చేరింది. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మురుగు కాలువలు దెబ్బతినడంతో ఈ పరిస్థితి తలెత్తిందని వాపోతున్నారు. కాలువలు బాగు చేయాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పెద్దపంజాణి

చిన్నారి మృతికి కారకులను వదిలే ప్రసక్తే లేదు: చల్లా

పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ఉబేదుల్లా కాంపౌండుకు చెందిన ఏడేళ్ల బాలిక అస్ఫియా అంజుమ్ మృతికి కారకులను వదిలే ప్రసక్తే లేదని నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. రెండు రోజుల కిందట తప్పిపోయిన చిన్నారి మృతదేహంగా కనిపించడం పట్ల ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను పట్టుకోవాలని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోనుందని చెప్పారు.

సమగ్ర విచారణ చేపట్టాలి

పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ఉబేదుల్లా కాంపౌండుకు చెందిన ఏడేళ్ల బాలిక అస్ఫియా అంజుమ్ అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి డా.టి. జనార్దన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు మున్నా బుధవారం ఓ ప్రకటనలో డిమాండు చేశారు.



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

నిరసన ర్యాలీ

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: అస్ఫియా అంజుమ్ అధ్యక్షం ఆపై హత్య జరగడంతో బుధవారం రాత్రి ముస్లిం సోదరులు స్థానిక ఇందిర కూడలి నుంచి ఎన్టీఆర్ కూడలి వరకు నిరాదాలు చేస్తూ ర్యాలీ చేశారు.







తెదేపా కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్ మునిరత్నం ◆ పుంగనూరులో.. ◆ బైరెడ్డిపల్లెలో..

మహాత్ముని అడుగు జాడల్లో నడవాలి

కుప్పం పట్టణం: మహాత్మాగాంధీ నేర్పిన అడుగుజాడల్లో నడవాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడా ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్ అన్నారు. బుధవారం స్థానిక తెదేపా కార్యాలయం, పురపాలిక కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాల్లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్ మునిరత్నం, కమిషనర్ శ్రీనివాసరావు, నాయకులు రాజకుమార్, గోపీనాథ్, ప్రేమ్‌కుమార్, పాల్గొన్నారు. పుంగనూరు: మహాత్మాగాంధీ ఆశయాల సాధనకు కృషి చేద్దామని పురపాలిక చైర్మన్ అలీంబాషా అన్నారు. బుధవారం మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా స్థానిక పురపాలక కార్యాలయ ఆవరణలో మహాత్మా విగ్రహానికి పూజలు చేశారు.

నదుం: మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక ప్రాథమిక పాఠశాల సమీపంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి లయన్స్ క్లబ్ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. చౌడేపల్లె: స్థానిక ఉన్నత పాఠశాల ఎదుట ఉన్న మహాత్మగాంధీ విగ్రహానికి బుధవారం పట్టణంలోని ఆర్యవైశ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. బైరెడ్డిపల్లె: మహాత్మా గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంపీపీ రెడ్డప్ప అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కల్లూరు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గాంధీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. పులిచెర్లలోని బాపూజీ విగ్రహానికి స్థానిక సర్పంచి రామయ్య, ఎంపీడీవో రాజశేఖర్‌బాబు పూలమాల వేసి నివాళి అర్పించారు. శాంతిపురం: స్థానిక మండల సచివాలయం, తెదేపా కార్యాలయం, రాళ్లబూదుగూరు పోలీస్‌స్టేషన్, వెలుగు, ఉపాధి భవనాల్లో మహాత్మ గాంధీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కుమార్, ఎస్సై నరేష్, నాయకులు పాల్గొన్నారు. గుడుపల్లె: మండల పరిధిలోని గ్రామ పంచాయతీ కేంద్రాల్లో, స్థానిక పోలీస్‌స్టేషన్, డిగ్రీ కళాశాలలో బుధవారం గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు.



గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు



గుడుపల్లె: సోడిగానిపల్లెలో..



శాంతిపురం: మండల సచివాలయంలో గాంధీ చిత్రపటానికి పూజలు

పరిసరాల శుభ్రత.. పర్యావరణ రక్ష.. కుప్పం పట్టణం: పరిసరాలను శుభ్రంగా ఉంచడం ద్వారా పర్యావరణ రక్షతో పాటు, ప్రజారోగ్యం సాధ్యమవుతుందని టీసీఎస్ విద్యా సంస్థల ఆధినేత టీపీ నాగరాజ్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం పురపాలిక పరిధిలోని తంబిగానిపల్లె, 16వ వార్డులోని బస్టాప్ ప్రాంతంలో కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శ్రమదానం చేశారు.

అవీ.. ఇవీ.. అన్నీ

సంపూర్ణ పౌష్టికాహారంతోనే ఆరోగ్యం.. పుంగనూరు: నేటి పరిస్థితుల్లో వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రతను పాటిస్తేనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని తెదేపా నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు గంగాధర, రమణ, గంగులప్ప అన్నారు. బుధవారం భీమగానిపల్లెలో పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు.

పింఛన్ పంపిణీ.. కల్లూరు: పింఛన్ల పంపిణీలో భాగంగా బుధవారం కల్లూరు సచివాలయ ఉద్యోగి జేఎల్ఎం హేమశేఖర్ స్థానిక దిగువ వీధికి చెందిన ఎస్ సులేమాన్‌కు పింఛను రూ.6వేల నగదును బెంగళూరు వెళ్లి అందజేశారు. మంగళంపేటకు చెందిన పద్మావతి నెల్లూరులో ఉండటంతో సచివాలయ ఉద్యోగి అక్కడికి వెళ్లి పింఛన్ అందజేశారు.

పచ్చదనాన్ని పెంచుదాం.. పుంగనూరు: మానవాళి మనుగడకు దోహదపడే పచ్చదనాన్ని పెంపొందిద్దామని భాజపా నాయకుడు అయూబ్‌ఖాన్ కోరారు. బుధవారం స్థానిక టిప్పు ఇక్ష సముదాయ ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ ఒక్క మొక్క నాటి సంరక్షిస్తే ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. నాయకులు బాబు, నరసింహులు పాల్గొన్నారు.

గోకులం షెడ్ల నిర్మాణాలు ప్రారంభం.. శాంతిపురం: మండల పరిధిలో పాడి రైతులకు ప్రభుత్వం రాయితీపై మంజూరు చేసిన మినీ గోకులం షెడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేసి బుధవారం ప్రారంభించారు. అనిమిగానిపల్లె, అనికెర పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో తెదేపా నేతలు రమేష్, మునిరత్నం, సుబ్రహ్మణ్యం, మునిరెడ్డి, యూనిట్ ఇన్‌ఛార్జి రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

అమ్మవారికి పూజలు.. పుంగనూరు: పట్టణంలోని పురపాలిక బస్టాండు సమీపంలోని విరూపాక్షి మారెమ్మ దేవత ఆలయంలో బుధవారం అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వానలు కురవాలని.. బైరెడ్డిపల్లె: వరుణదేవా కరుణించగ రావా..! వానలు లేక బతుకు దుర్భరంగా మారిందని గంగినాయునిపల్లె గ్రామస్థులు బుధవారం కప్పదేవర ఊరేగింపు చేపట్టారు. గ్రామస్థులు స్థానిక చెరువులో కప్పలను తీసుకొచ్చి ఓ రోకలికి కట్టి పెళ్లి చేశారు. కప్పలను గ్రామంలో ఊరేగించారు. గోవింద నామస్మరణతో వరుణ దేవుడిని ప్రార్థించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కుప్పం పట్టణం: నియోజకవర్గ పరిధిలో 10 మద్యం దుకాణాలకు సంబంధించి ఆన్‌లైన్ టెండర్ల ద్వారా లక్కీ డిప్ నిర్వహించనున్నామని.. ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ మోహన్‌బాబు తెలిపారు. ఈ నెల 9 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 11న లక్కీడిప్ నిర్వహించనున్నట్లు చెప్పారు. కల్లూరు: మద్యం దుకాణాల టెండర్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పులిచెర్ల ఎక్సైజ్ శాఖ ఎస్సై ఎ.మాధవస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాల కోసం 91824 91056, 81062 23359, 96189 20857 సంప్రదించాలన్నారు. పలమనేరు: నియోజకవర్గంలో ప్రభుత్వ దుకాణాలను కేటాయించింది. మున్సిపల్ పరిధిలో-6, వి.కోట-3, గంగవరం-2, బైరెడ్డిపల్లె-2 దుకాణాలు ఉన్నాయని ఎక్సైజ్ సీఐ లక్ష్మీ తెలిపారు. దుకాణాలు అవసరమైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

టీఎన్‌టీయూసీ ఎన్నిక ఏకగ్రీవం

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: రెస్కో టీఎన్‌టీయూసీ ఎన్నిక ఏకగ్రీవంగా నిర్వహించినట్లు టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుగుణాకరరావు తెలిపారు. కుప్పంలో బుధవారం తెలుగునాడు విద్యుత్తు కార్మిక సంఘం కార్యవర్గ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా వెంకటేష్, ఉపాధ్యక్షులుగా బాలాజీ, ఆనంద్, మురుగేష్, కార్యదర్శులుగా మురుగప్ప, నారాయణప్ప, కోశాధికారిగా రమేష్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ.. విద్యుత్తు కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం కార్మికులకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజ్‌కుమార్, గోపీనాథ్, జాకీర్ పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

నదుం, న్యూస్‌టుడే: వైకాపా నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దు అండగా ఉంటానని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో ప్రజాప్రతినిధులు, వైకాపా నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, వైకాపా రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, పుంగనూరు మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

గంగవరం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు గంగవరం విద్యార్థి ఎంపికైనట్లు పీడీ సరస్వతి తెలిపారు. జోనల్ పోటీల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి ఎంపిక కోసం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థి మోహన్ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పీడీ తెలిపారు.

కంటి చూపుపై అశ్రద్ధ వద్దు

రామకుప్పం, న్యూస్‌టుడే: కంటి చూపుపై అశ్రద్ధ వద్దని తెదేపా మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బందార్లపల్లి పంచాయతీలో బుధవారం చంద్రన్న కంటి వైద్య శిబిరంలో నేత్ర సమస్యలున్న వారికి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కంటి వ్యాధిగ్రస్థుల అధికంగా ఉండటంతో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీకాంత్, నేతలు నరసింహులు, విశ్వనాథ్, రవి, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో లక్ష్మీకాంత్, తెదేపా మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి

మా పోలీస్‌స్టేషన్‌కు ఎస్సై కావాలి

◆ రెండు నెలలుగా కుర్చీ ఖాళీ ◆ పెరుగుతున్న పని ఒత్తిడి

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రెండు నెలలుగా పైగా ఎస్సై కుర్చీ ఖాళీగా దర్శనమిస్తోంది. గతంలో ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న కృష్ణయ్యను జిల్లా ఉన్నతాధికారులు చిత్తూరు వీఆర్‌కు బదిలీ చేశారు. గత ప్రభుత్వంలో వైకాపా నాయకులకు అనుకూలంగా పనిచేశారని వచ్చిన ఆరోపణలతో వీఆర్‌కు పంపారు. అప్పట్నుంచి ఇప్పటివరకు, హెడ్‌కానిస్టేబుల్ స్టేషన్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఎస్సైల బదిలీల్లో భాగంగా అనంతపురం జిల్లా నుంచి పరశురామను బైరెడ్డిపల్లె ఎస్సైగా నియమించారు. నూతన ఎస్సైగా నియామకం జరిగి రెండు నెలలు కావస్తున్నా ఆయన విధుల్లో చేరలేదు. దీంతో మండల పరిధిలో శాంతిభద్రత సమస్య పరిష్కారం సిబ్బందికి సవాలుగా మారుతోంది. నేర ఘటనలు జరిగితే పలమనేరు గ్రామీణ సీఐ మురళీమోహన్ బైరెడ్డిపల్లెకు వచ్చి పరిష్కరిస్తున్నారు.



చేరకపోవడంతో మరో వైపు సిబ్బంది కొరతతో పోలీసులు సతమతమవుతున్నారు. స్టేషన్‌లో ఆరుగురు కానిస్టేబుళ్లకు ఐదుగురే ఉన్నారు. అక్కడ కొరత సిబ్బంది. ఆపై ఇతర ప్రాంతాలకు బందోబస్తులు వేస్తుండటంతో పని ఒత్తిడి ఎక్కువగా ఉంటోంది. నిత్యం స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేయడానికి అవస్థలు తప్పడం లేదు. దుకాణాల్లో అగ్నిప్రమాద ఘటనలు తప్పడం లేదు. ప్రతి రోజు ఎక్కడో ఒకచోట దొంగతనాలు, చోరీ ఘటనలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. శాంతిభద్రతల పరిరక్షణ బైరెడ్డిపల్లె స్టేషన్‌కు ఓ ఎస్సై, సరిపడ సిబ్బంది నియామకం చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణ ప్రశ్నార్థకం

స్టేషన్ బాధ్యతలు చేపట్టాల్సిన ఎస్సై విధుల్లో

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



జి.కృష్ణమూర్తి (పాత చిత్రం)

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పుంగనూరు-మదనపల్లె రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. పోలీసులు వివరాల మేరకు.. గత నెల 24న మదనపల్లె నుంచి పుంగనూరుకు వెళ్తున్న బొలెరో వాహనం పుంగనూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేటు బస్సును ఢీకొనడంతో అన్నమయ్య జిల్లా కేవీపల్లె మండలం మినమరెడ్డిగారిపల్లెకు చెందిన బొలెరోలో డ్రైవర్ జి.కృష్ణమూర్తి(30) తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు.

లారీ, బైక్ ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: బైరెడ్డిపల్లె-పుంగనూరు రహదారిలో విన్నపల్లె రగుటి మలుపు వద్ద బుధవారం లారీ, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఆటుకురాపల్లెకు చెందిన యుగంధర్, చలగానిపల్లెకు చెందిన గిరిరాజ నాయుని రోడ్డు నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో యుగంధర్, గిరిరాజ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం కుప్పం ఆసుపత్రికి తరలించారు.

పంటలపై ఏనుగుల బీభత్సం

కల్లూరు, న్యూస్‌టుడే: పులిచెర్ల మండలంలో ఏనుగుల పంట పొలాలపై దాడులు చేయడంతో రైతులకు నష్టం వాటిల్లుతోంది. పాతం పంచాయతీలోని పలు గ్రామాల్లో పంట పొలాలపై ఏనుగుల గుంపు మంగళవారం అర్ధరాత్రి బీభత్సం చేశాయి. పంచాయతీలోని కోటపల్లెకు చెందిన రైతు సుబ్రహ్మణ్యం చెందిన మామిడి తోటలో 60 చెట్ల కొమ్మలు విరిచేశాయి. మామిడికాయలను నేలపాలు చేశాయి. ఇదే గ్రామానికి చెందిన రైతు హరి సాగు చేసిన టమోటా పంటను, కొంగరవారిపల్లెకు చెందిన సురేంద్రనాయుడు, వెంకట్రమణ నాయుడుకు చెందిన ఎకరా వరిని తొక్కి ధ్వంసం చేశాయి.

వృద్ధుడి అదృశ్యం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: కొటాలవంక గ్రామంలో నివాసముంటున్న రామప్ప(65) అదృశ్యంపై కుటుంబ సభ్యులు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. 81.ఉప్పరపల్లె కుప్పం నుంచి ఉపాధి కోసం వలస వచ్చి ఠీర్ధం వద్ద ఇటుకల కోస్టా జీవనం సాగిస్తున్నామని చెప్పారు. సెప్టెంబరు 27 నుంచి కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.